నేడు ఉచిత వైద్య శిబిరం

సనత్‌నగర్: జెక్‌కాలనీలోని పార్థివ్ లంగ్‌కేర్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం మూసాపేట ఆంజనేయనగర్‌లోని జీహెచ్‌ఎంసీ పార్కులో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి ఎండీ, ప్రముఖ పల్మనాలజిస్ట్ డాక్టర్ నాగరాజు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈఎన్‌టీ, పల్మనాలజీ, జనరల్ మెడిసిన్, గైనకాలజీ సమస్యలకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించబడతాయని పేర్కొన్నారు. అలాగే బీపీ, జీఆర్‌బీఎస్, పీఎఫ్‌టీ (పల్మనాలజీ ఫంక్షన్ టెస్ట్), ఆడియోమెట్రీ (హియరింగ్ టెస్ట్) జరుపుతారని పేర్కొన్నారు.

వారాసిగూడలో..

బౌద్ధనగర్: సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావుగౌడ్ సహకారంతో ఆదివారం వారాసిగూడలోని ఎస్‌ఆర్‌వీ మల్టీ స్పెషాలిటీ క్లినిక్‌లో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు మేనేజింగ్ డైరెక్టర్ సుంకు రామచందర్ తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటలకు వరకు ఉచిత వైద్య పరీక్షలతో పాటు నిపుణులైన వైద్య బృందం ద్వారా ఉచిత వైద్య సూచనలు అందిస్తామన్నారు. రోగులకు ఖరీదైన మందులు కూడా పూర్తిగా ఉచితంగా ఈ శిబిరంలో అందించేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఈ శిబిరాన్ని సికింద్రాబాద్‌లోని బౌద్ధనగర్, వారసిగూడ, పార్శిగుట్ట, సీతాఫల్‌మండి, మానికేశ్వర్ నగర్, తార్నాక, మెట్టుగూడ, చిలకలగూడ, అడ్డగుట్ట, లాలాగూడ, లాలాపేట తదితర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సుంకు రామచందర్ కోరారు.

హమాలిబస్తీలో చెత్తకుప్పలు తొలగించండి



సికింద్రాబాద్: మెట్టుగూడ డివిజన్ హమాలిబస్తీలో పేరుకుపోతున్న చెత్తకుప్పలు స్థానిక ప్రజలకు ఇబ్బందికరంగా మారాయి. రహదారులపై చెత్తకుప్పలు పేరుకుపోతున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారని బస్తీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే వర్షాకాలంలో చెత్తకుప్పలతో ఈగలు, దోమలు వ్యాప్తి చెంది స్థానికంగా అనారోగ్యకర పరిస్థితులను తెచ్చిపెడుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హమాలిబస్తీలో పేరుకుపోతున్న చెత్తకుప్పలు తొలగించి తమకు అనర్థాలను దూరం చేయాలని జీహెచ్‌ఎంసీ అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని మహాజన సోషలిస్టుపార్టీ నాయకుడు దావా శివప్రసాద్ మాదిగ ఆరోపించారు. అధికారులు సత్వరమే స్పందించి హమాలిబస్తీలో పేరుకుపోతున్న చెత్తకుప్పలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

సెక్యూరిటీ గార్డ్ ఆత్మహత్య

సనత్‌నగర్: లేబర్ వెల్ఫేర్ గ్రౌండ్‌లోని జీహెచ్‌ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ పార్కింగ్ ఏరియాలో కిటికీకి ఉరేసుకొని సెక్యూరిటీగార్డ్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో మనహర్ (62) అనే వ్యక్తి కొన్నేళ్లుగా సెక్యూరిటీగార్డ్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వారంతా వేర్వేరుగా ఉంటున్నారు. కాగా మనోహర్ భార్య పద్మ స్వగ్రామానికి వెళ్లింది. ఈ క్రమంలో శనివారం ఉదయం తాను ఆత్మహత్య చేసుకుంటానని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఇతర సిబ్బందికి మనోహర్ చెప్పాడు. అయితే అతను హాస్యంగా అంటున్నాడని భావించి అంతగా పట్టించుకోలేదు. ఆ తర్వాత కొద్దిసేపటికే తాడుతో కిటికీ గ్రిల్స్‌కు ఉరేసుకొని వేలాడుతూ కనిపించగా హుటాహుటిన అక్కడికి చేరుకున్న స్పోర్ట్స్ కాంప్లెక్స్ సిబ్బంది అతన్ని కిందికి దించారు. అప్పటికే అతను మృతి చెందాడు. ఈ మేరకు సనత్‌నగర్ పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబ కలహాలతోనే అతను ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని అనుమానిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుట్కా ప్యాకెట్లను తరలిస్తున్న ఇద్దరు అరెస్టు

సనత్‌నగర్: నిషేధిత గుట్కా ప్యాకెట్లను పెద్ద మొత్తంలో తీసుకెళ్తున్న ఇద్దరిని బేగంపేట పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్స్‌లోని హెచ్‌పీ పెట్రోల్ బంకు దగ్గర బేగంపేట ఎస్ఐ షేక్ షఫీ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఈ నెల 12న సాయంత్రం వాహనాలను తనిఖీ చేశారు. అదే సమయంలో ఆ మార్గంలో టీజీ 12ఏ 0281 నెంబర్ గల బైక్‌పై వచ్చిన భవానీనగర్ తలాబ్‌కట్ట ఈదిబజార్‌కు చెందిన పాన్ మసాలా సరఫరాదారు సయ్యద్ మహమూద్ (56), చాంద్రాయణగుట్ట జీఎంకాలనీకి చెందిన అబ్దుల్లాబిన్ అలీ (49)లను ఆపి తనిఖీలు చేశారు. వారి వద్ద ఉన్న బ్యాగ్‌లో పెద్ద మొత్తంలో నిషేధిత గుట్కా ప్యాకెట్లు బయటపడ్డాయి. డిజైన్ గోవా 1000కు చెందిన 60 సాచెట్లు, ఈఎండీ గుట్కాకు చెందిన 50 సాచెట్లు స్వాధీనం చేసుకొని ఇరువురిని అరెస్టు చేశారు. ఈ గుట్కాలను కర్ణాటక రాష్ట్రంలోని బీదర్‌కు చెందిన సిరాజ్ నుంచి తక్కువ ధరకు సేకరించి, ఎక్కువ లాభం పొందడానికి అవసరమైన పాన్ షాప్ యజమానులకు అధిక ధరకు విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షెల్టర్ లేని బస్టాప్‌లు

అడ్డగుట్టలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు



బస్‌షెల్టర్ లేక అడ్డగుట్ట బస్టాప్‌లో ఎండలో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

అడ్డగుట్ట: ఆసియా ఖండంలోనే అతిపెద్ద మురికివాడగా పేరున్న అడ్డగుట్టలో దినదినాభివృద్ధి జరుగుతున్నప్పటికీ బస్ షెల్టర్‌ల విషయానికి వస్తే చెప్పుకోదగిన పురోగతి లేదు. అడ్డగుట్ట డివిజన్ నుంచి బస్సుల్లో ప్రయాణించే వారు బస్సు కోసం వేచి ఉండటానికి నిల్వ నీడలేదు. ప్రతీరోజు బస్సుల్లో ఇతరాత్ర పనులకు వెళ్లే అనేక మంది ప్రయాణికులు ఉంటారు. బస్టాపుల్లో బస్ షెల్టర్ కాని, కూర్చోవడానికి బెంచీలు కాని లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు మాత్రం కనీసం సమస్యను పరిష్కరించేలా ప్రయత్నించకుండా నిర్లక్ష్యం కనబరుస్తున్నారని పలువురు స్థానికులు వాపోతున్నారు. అడ్డగుట్ట డివిజన్‌లో సుమారు పది బస్టాప్‌లు ఉన్నప్పటికీ ఏ ఒక్క బస్టాప్‌లో కూడా బస్ షెల్టర్ లేదు. అడ్డగుట్ట బస్టాప్ మొదలుకొని తుకారాంగేట్, న్యూబ్రిడ్జ్, రైల్వే బాయ్స్, లాలాగూడ, శాంతినగర్‌లు సుమారు పది బస్టాండ్‌ల్లో బస్ షెల్టర్‌లు లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. లాలాగూడలో ఉన్న ఒక బస్‌షెల్టర్ కూడా పూర్తిగా దుర్గంధభరితంగా ఉండడంతో అందులో ప్రయాణికులు వేచి ఉండలేక రోడ్డు పైకి వచ్చి బస్సుల కోసం ఎదురుచూస్తుంటారు.

రెండు దశాబ్దాలుగా ఇదే పరిస్థితి

అడ్డగుట్టకు 25 ఏళ్ల క్రితం నుంచే ఆర్‌టీసీ సౌకర్యం ఉంది. ఏళ్లు గడుస్తున్నా ప్రయాణికుల సౌకర్యార్థం ఇప్పటి వరకు డివిజన్‌లో ఒక్క బస్ షెల్టర్ కూడా ఏర్పాటు చేయలేరు. అడ్డగుట్ట డివిజన్ నుంచి నిత్యం పనులకు వెళ్లే వాళ్లు వేల సంఖ్యలో ఉంటారు. వారి పనుల నిమిత్తం బస్సులోనే వెళ్తుంటారు. అసలే, అడ్డగుట్టకు బస్సు సౌకర్యం అంతంత మాత్రమే, దీనికితోడు ప్రయాణికులు బస్టాపుల్లో గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తుంది. ప్రయాణికుల్లో వృద్ధులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, దివ్యాంగులు, మహిళలు అనేక మంది ఉంటారు. బస్సు కోసం వేచి చూసే సమయాల్లో కూర్చోవడానికి నిల్వ నీడ కూడా లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండుటెండలో బస్సుల కోసం ఎదురుచూపులు



అడ్డగుట్ట చంద్రయ్య హోటల్ వద్ద బస్టాప్‌లోనే వాహనాల పార్కింగ్

మహిళల అవస్థలు వర్ణనాతీతం

అడ్డగుట్టలోని చంద్రయ్య హోటల్, తుకారాంగేట్ సుభాష్ బొమ్మ సమీపంలో ఉన్నటువంటి బస్టాప్‌ల పక్కనే వైన్స్ షాపులు ఉన్నాయి. దీంతో నిత్యం బస్సులు, ఆటోల కోసం బస్టాపుల్లో ఎదురుచూసే మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారు. బస్‌షెల్టర్ లేని కారణంగా వైన్స్ పక్కనే బస్సుల కోసం ఎదురుచూస్తుండడం చాలా ఇబ్బందికరంగా ఉందని మహిళలు, స్కూళ్లకు వెళ్లే విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా షాపుకు వచ్చే వాళ్లు ఇష్టానుసారంగా బస్టాపుల్లో వాహనాలకు పార్కింగ్ చేసి వెళ్తున్నారని చెబుతున్నారు.

ఎండా, వానల్లో నానా తంటాలు

ప్రతిరోజు ఉదయాన్నే వివిధ పనులకు వెళ్లేందుకు ప్రయాణికులు బస్టాప్‌లకు వస్తుంటారు. ఆలస్యంగా వచ్చే బస్సులతో, అదే విధంగా బస్‌షెల్టర్‌లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతూ వేచి ఉంటున్నాం. బస్‌షెల్టర్ ఉంటే కొంత మేరకు సేద తీరేదని, బస్ షెల్టర్ లేక, కూర్చునేందుకు బెంచీలు లేకపోవడం, సమయానికి బస్సులు రాకపోవడం వంటి వాటితో నరకం అనుభవిస్తున్నాం. డివిజన్ పరిధిలో ఉన్న ఏ బస్టాప్‌లో కూడా బస్ షెల్టర్ లేదు. దీంతో బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు ఎండలో మగ్గిపోతున్నారు.

అధికారులు ఇప్పటికైనా స్పందించాలి



బస్టాపుల్లో వేసవి, వర్షకాలాల్లో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొకుండా ఉండేలా కనీస సౌకర్యాలు కూడా కల్పించకపోవడం సిగ్గుచేటు. ఏళ్లు గడుస్తున్నా బస్ షెల్టర్ ఏర్పాటు చేయడానికి ఏ ఒక్క అధికార ప్రజాప్రతినిధి, సంబంధిత అధికారి చొరవ తీసుకోవడంలేదు. ఇప్పటికే ఈ విషయంపై అనేక సార్లు సంబంధిత అధికారులకు వినతి పత్రాలు సమర్పించామని, కానీ ప్రయాణికుల సమస్యను తీర్చే దిశగా ఏ అధికారి ముందుకు రావడంలేదు. బస్‌షెల్టర్ల నిర్మాణ విషయంలో అధికారులు ముందడుగు వేస్తారని ఆశిస్తున్నాం.

– గెల్లు ఉదయ్‌యాదవ్, బీజేవైఎం నాయకుడు

కేంద్ర మంత్రిని కలిసిన బండ కార్తీక



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన బీజేపీ ఉపాధ్యక్షురాలు బండ కార్తీకచంద్రరెడ్డి

సికింద్రాబాద్: బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా నూతనంగా నియమితులైన గ్రేటర్ మాజీ మేయర్ బండ కార్తీక చంద్రారెడ్డి శనివారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీలో తనకు సముచితమైన ప్రాధాన్యత కల్పించినందుకు కిషన్‌రెడ్డికి ఆమె ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను అంకితభావంతో పార్టీకి అందిస్తున్న సేవలను గుర్తించి, రాష్ట్రకమిటీలో స్థానం కల్పించినందుకు పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా రానున్న రోజుల్లో రాష్ట్రంలో పర్యటించి అన్నిశ్రేణుల నాయకులతో సమన్వయంతో పనిచేసి బీజేపీని అధికారంలోకి రావడానికి కృషి చేయాలని తమకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మార్గనిర్దేశనం చేసినట్టు ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బండ చంద్రారెడ్డి, మేకల సారంగపాణి, పోచయ్య యాదవ్, వీరన్న, సంపత్, రాజ్ కుమార్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత సేవలు అభినందనీయం

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

అమీర్‌పేట: శంకర నేత్రాలయం ట్రస్ట్ ద్వారా నిరుపేదలకు ఉచితంగా సేవలు అందించడం అభినందనీయమని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. బల్కంపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆస్పత్రిని శనివారం మాజీ ఎంపీ వేణుగోపాలచారితో కలిసి ప్రారంభించారు. కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆస్పత్రి ఆధ్వర్యంలో బస్తీల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, వైద్య పరీక్షలు చేయడంతో పాటు అనేక మందికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించారని తెలిపారు. ప్రతీ వైద్యుడు సేవాగుణం కలిగి ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్ డా.రవిందర్‌గౌడ్, వివిధ పార్టీల నాయకులు కొలను బాల్‌రెడ్డి, వెంటక్‌రాజ్, కమల్‌రాజ్, మాజీ కార్పొరేటర్ కంజర్ల శ్రీనివాస్‌యాదవ్, హనుమంత్‌రావు, సుధీర్‌కుమార్, వనం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు



జ్యోతి ప్రజ్వలన చేసి ఆస్పత్రిని ప్రారంభించిన ఎమ్మెల్యే దానం, వేణుగోపాలచారి

శ్మశానవాటికలో మెరుగైన సదుపాయాలు

కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి



బేగంపేట ధనియాలగుట్ట శ్మశానవాటికను పరిశీలించిన కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి

సనత్‌నగర్: బేగంపేట శ్యాంలాల్‌బిల్డింగ్ సమీపంలోని ధనియాలగుట్ట శ్మశానవాటికలో మెరుగైన సదుపాయాలతో పాటు అక్కడ భద్రతను ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు. శ్మశానంలో వ్యభిచార నిర్వహణ విషయం వెలుగులోకి రావడంతో అధికార యంత్రాంగాన్ని ఆమె అప్రమత్తం చేసి శనివారం వారితో కలిసి పరిశీలించారు. ముఖ్యంగా శానిటేషన్ సిబ్బంది ఎప్పటికప్పుడు ఇక్కడ క్లీనింగ్ పనులు చేపట్టాలన్నారు. హార్టికల్చర్ అధికారులు గ్రీనరీని మరింతగా పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీసు అధికారులు ప్రతిరోజూ ఇక్కడ పెట్రోలింగ్ విధులు నిర్వర్తించాలన్నారు. శ్మశానవాటిక నిర్వహణ బాధ్యతలను అప్పగించేందుకు టెండర్లను ఆహ్వానించాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా ఎవరు వెళ్తున్నారు, ఎవరు వస్తున్నారో అన్న దానిపై నిరంతర నిఘా ఉంచేలా సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా ఊరుకునేది లేదని ఈ సందర్భంగా కార్పొరేటర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ బేగంపేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాకూనాయక్, ఏఈ, పోలీసు అధికారులతో పాటు బీఆర్‌ఎస్ నేతలు శ్రీహరి, నరేశ్, రఘునాథ్, శ్రీనివాస్, మాణిక్, రాంచదర్, శమీలతో పాటు శ్యాంలాల్ బిల్డింగ్ కో–ఆపరేటివ్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

టెక్స్ అకాడమి జాబ్ మేళాకు విశేష స్పందన



జాబ్ మేళాలో పాల్గొన్న నిరుద్యోగ యువతీ, యువకులు

రాంగోపాల్‌పేట్: టెక్స్ అకాడమి ఆధ్వర్యంలో శనివారం డ్రీమ్ ల్యాండ్ గార్డెన్‌లో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. సుమారు 500 మంది విద్యార్థులు ఈ మేళాలో పాల్గొనగా సుమారు 200 మందికి పైగా వివిధ ప్రముఖ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు దక్కించుకున్నారు. ఐటీ, బీఎఫ్‌ఎస్ఐ, డిజిటల్ మార్కెటింగ్, మెడికల్ కోడింగ్, ఆటోసీఏడీ, బీఎంఐ లాంటి 25 ప్రముఖ కంపెనీలో తమకు అవసరమున్న ఉద్యోగస్తుల కోసం ఈ మేళాలో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా టెక్స్ అకాడమి ఎండీ జహీరుద్దీన్ మాట్లాడుతూ విద్యార్థులకు ఐటీ, ఏఐలతో పాటు వివిధ అంశాల్లో ఉత్తమ శిక్షణ ఇవ్వడంతో పాటు వారిలోని నైపుణ్యాలను మెరుగు పరచడం, మాక్ ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగ అవకాశాలు పొందేలా తీర్చిదిద్దుతామని చెప్పారు. 14 ఏళ్లుగా తెలంగాణతో పాటు ఏపీ, బెంగళూరులోని శాఖల ద్వారా ఆయా రంగాల్లో వేల మందికి శిక్షణ ఉపాధి అవకాశాలు కల్పించినట్లు చెప్పారు. ఆరు నెలలకు ఒక మారు ఇలాంటి జాబ్ మేళాల ద్వారా ఉద్యోగావకాశాలు పొందేలా ఉత్తమ శిక్షణ అందిస్తామని చెప్పారు.

200 మందికి ఉద్యోగావకాశాలు

డిజైన్ పరిశ్రమలో వినూత్న మార్పులు

ఐఐఐడీ సమావేశంలో నిపుణులు

సనత్‌నగర్: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటీరియర్ డిజైనర్స్ (ఐఐఐడీ) ఆధ్వర్యంలో బేగంపేటలోని ఐటీసీ గ్రాండ్ కాకతీయ హోటల్‌లో డిజైన్ పరిశ్రమలో ఉద్భవిస్తున్న ధోరణులపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఒకే వేదికపై ఆర్కిటెక్టులు, ఇంటీరియర్ డిజైనర్లు, ట్రేడ్ సభ్యులు, విద్యావేత్తలు హాజరై పరస్పరం తమ ఆలోచనలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఐఐఐడీ ప్రతినిధులు మాట్లాడుతూ.. 1996లో ప్రారంభమైన నాటి నుంచి 800లకు పైగా సభ్యులతో బలమైన రీజనల్ చాప్టర్‌గా ఎదిగిందన్నారు. డిజైన్ ఎక్స్‌లెన్స్ అవార్డులు, ఫెలోషిప్ సమావేశాలు, విద్యార్థుల వర్క్‌షాప్‌లు, డిజైన్ వాక్స్, చాప్టర్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. కాగా ఈ సమావేశంలో నూతన మేనేజింగ్ కమిటీని ప్రకటించారు. చైర్మన్‌గా ప్రవీణ్‌కుమార్, వైస్ చైర్మన్‌గా రమేశ్‌పటేల్, సెక్రటరీగా సీఎస్ రాకేశ్‌వాసు, జాయింట్ సెక్రటరీగా గౌరవ్ పెర్షద్, కోశాధికారిగా నవీన్‌కుమార్ చలసాని, సభ్యులుగా సుష్మిత సుబుధి, వందన ఆశిష్, భవంత్ ఆనంద్, కో–ఆపరేటెడ్ సభ్యులుగా సంజనషా, అమిత్‌షా, రోక్సానా చెహ్నా, ఎగ్జిక్యూటివ్ సెక్రటరీగా శ్రీనాథ్, అకౌంటెంట్‌గా జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.



ఐఐఐడీ సమావేశంలో పాల్గొన్న సభ్యులు

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి

లాలాపేట: విద్యార్థులు భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న దాదాపు 8 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలనీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేస్తూ శనివారం పత్రికా ప్రకటనను విడుదల చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను చేయవద్దని, సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా ఆ డబ్బులను కాళేశ్వరం, మిషన్ భగీరథ వంటి పథకాలకు ఖర్చు చేసి తెలంగాణ సొమ్మును కాంట్రాక్టర్‌లకు దోచిపెట్టిందన్నారు. మరో వైపు ఫీజులు చెల్లించకపోవడంతో ఆయా కళాశాలలు విద్యార్థులకు ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వడంలో ఆలస్యం చేస్తున్నారు. దీంతో విద్యార్థులంతా తీవ్ర ఇబ్బంది పడ్డారని వివరించారు. పైగా ఈ విషయంలో కాలేజీలు సైతం బంద్ పాటిస్తున్నామని ప్రకటించిన నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే జోక్యం చేసుకొని విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు.



పత్రికా ప్రకటన విడుదల చేస్తున్న జాజుల లింగం గౌడ్

మూలం సంతకు విశేష స్పందన



తార్నాకలో మూలం సంతను ప్రారంభిస్తున్న ప్రముఖులు

లాలాపేట: గ్రామభారతీ, సీఎస్‌ఆర్ మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తార్నాకలోని మర్రి కృష్ణా హాల్లో శనివారం నిర్వహించిన 15వ మూలం సంతకు స్థానికుల నుంచి విశేష ఆదరణ లభించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి రైతులు, చేతి వృత్తుల వారు దాదాపు 70 మందికి పైగా ఇందులో పాల్గొని ప్రకృతి–గ్రామీణ ఉత్పత్తులను వినియోగదారులకు అందుబాటులో ఉంచారు. గో–ఆధారిత వస్తువులతో సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చునని ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడారు. వ్యవసాయాన్ని, వ్యవసాయాధారిత రంగాలను ప్రోత్సహించడానికి ప్రజలందరూ ఈ మూలం సంతను ఆదరించాలని కోరారు. వనమూలికలతో తయారు చేసిన దవా చాయ్ ఈ సంతలో ప్రత్యేకంగా అందరికి ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కృష్ణారెడ్డి, కరుణాకర్, మల్లేశం, సుబ్రమణియం, మీనా, గ్రామభారతీ, సీఎస్‌ఆర్ వలంటీర్లు పాల్గొన్నారు.

సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించిన మేయర్

వెంగళరావునగర్: ఒకవైపు నగరాన్ని ఎంతో పరిశుభ్రంగా ఉంచడానికి కోట్లాది రూపాయలు వెచ్చించి నిత్యం పనులు చేపడుతుంటే మరో వైపు చెత్తను ఇక్కడే స్టాక్ ఉంచడం ఏంటని జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని జీహెచ్‌ఎంసీ సర్కిల్–19 కార్యాలయం, పక్కనే ఉన్న డంపింగ్ కేంద్రం పరిసర ప్రాంతాలను శనివారం ఆమె ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో చెత్త నిల్వలు ఉండటానికి చూసి, ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇదేమిటి చెత్త ఎప్పటికప్పుడు తరలించాలని, ఎక్కడా కూడా నిల్వ ఉంచకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని చెప్పారు. స్థానిక ప్రజలు కూడా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ సర్కిల్–19 ఉప కమిషనర్ రజినీకాంత్‌రెడ్డి తదితర నేతలు ఉన్నారు.



ఉప కమిషనర్‌తో చర్చిస్తున్న మేయర్

విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

బౌద్ధనగర్: తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవిప్రసాద్‌గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం బౌద్ధనగర్ డివిజన్ అధ్యక్షుడు సాయిప్రసాద్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి అయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబర్ 17 నుంచి ప్రధానమంత్రి నరెంద్రమోదీ జన్మదినం సందర్భంగా నిర్వహించబోయే సేవా పక్షం అభియాన్ 15రోజుల పాటు కార్యక్రమాన్ని నిర్వహిస్తూ సమాజంపై మన బాధ్యతను తెలియజేస్తుందన్నారు. తెలంగాణలో సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలను కేంద్ర ప్రభుత్వం ద్వారా అధికారికంగా నిర్వహించుకుంటున్నామని తెలిపారు. ప్రధాని నరెంద్రమోదీ నేతృత్వంలో దేశంలోని రైతులు, వ్యాపారులు ఇలా ప్రతీ రంగంలోనూ వేగంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. భారత ప్రభుత్వం జీఎస్టీని తగ్గించి పేద, మధ్య తరగతి ప్రజలకు ఊరట కలిగించిందని అన్నారు. సెప్టెంబర్17న బీజేవైఎం. ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, సెప్టెంబర్ 18న మహిళా మోర్చ ఆధ్వర్యంలో స్కూల్స్, విద్యా సంస్థలు, కమ్యూనిటీ సెంటర్స్‌లో వికసిత్ భారత్, స్వచ్ఛభారత్ కాంపిటిషన్స్, సెప్టెంబర్ 21న బీజేవైఎం ఆధ్వర్యంలో మారథాన్ చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ స్వరూపగౌడ్, కుమార్, నాగరాజు, చైతన్య, సుబ్బారావు లడ్డు, జయంత్, శ్యామ్, గంజి నవీన్, సురేశ్, ప్రమోద్ శ్రీను, భిక్షపతి, కృష్ణ, దీపక్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



బౌద్ధనగర్‌లో సమావేశమైన బీజేపీ నాయకులు

నేడు గాంధీ మెడికల్ కాలేజీ వ్యవస్థాపక దినోత్సవం



గాంధీ ఆస్పత్రి: నిష్ణాతులైన వైద్యులను తయారు చేయడంలో సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కళాశాల నేటికి 71 వసంతాలు పూర్తి చేసుకుంది. పీపుల్స్ మెడికల్ కాలేజీగా ప్రస్థానాన్ని ప్రారంభించి గాంధీ మెడికల్ కళాశాలగా దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మక ఆస్పత్రిగా నిలిచింది. వేలాది మంది నిష్ణాతులైన వైద్యులను తయారుచూస్తూ.. గాంధీఆస్పత్రిలో లక్షలాది మంది నిరుపేద రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తోంది.

అలుమ్నీ సేవలు

గాంధీ మెడికల్ కాలేజీ పూర్వవిద్యార్థుల సంఘం(అలుమ్నీ అసోషియేషన్) అన్నివిధాల వైద్యవిద్యార్థులను ప్రోత్సహిస్తోంది. అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించిన విద్యార్థులకు ఏటా గోల్డ్‌మెడల్స్, ప్రోత్సాహక బహుమతులు అందిస్తోంది. ఆదివారం గాంధీ కళాశాల ప్రాంగణంలోని అలుమ్నీ భవనంలో 71వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ జీఆర్ లింగమూర్తి, వెంకటరత్నంలు తెలిపారు. నిమ్స్ మాజీ డైరెక్టర్ రాజారెడ్డి, డీఎంఈ నరేందర్‌కుమార్, గాంధీ ప్రిన్సిపాల్ ఇందిర, సూపరింటెండెంట్ వాణి తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నారు.

జీవో 99ను వెంటనే సవరించాలి

హిమాయత్‌నగర్: జీవో 99తో ఎస్సీలలోని 58 కులాలకు జరుగుతున్న అన్యాయంపై సీఎం రేవంత్ రెడ్డి వెంటనే స్పందించాలని కోరుతూ శనివారం తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ మందాల భాస్కర్, గ్రేటర్ హైదరాబాద్ మాల సంఘాల జేఏసీ చైర్మన్ బేర బాలకిషన్ ఆధ్వర్యంలోని బృందం ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం నియమించిన మంత్రివర్గ ఉప సంఘం సభ్యులు, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు శనివారం వినతిపత్రం సమర్పించింది. మంత్రివర్గ ఉప సంఘంతో, మాల ప్రజా ప్రతినిధులతో సీఎం చర్చించి న్యాయం చేయాలని డిమాండ్ చేసింది. సుప్రీంకోర్టు గైడ్ లైన్స్‌ను పాటించకుండా చేసిన ఎస్సీ వర్గీకరణ వల్ల ఈడబ్ల్యూఎస్ వర్గాల కంటే కూడా రోస్టర్ విధానంలో ఎస్సీలలోని 58 కులాలకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేసింది. వినతి పత్రం అందజేసిన వారిలో జేఏసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు చెరుకు రాంచందర్, నాయకులు రాహుల్‌రావు, ఎస్.నర్సింగ్ రావు, పి.భాను, ఎన్.సైదులు, డాక్టర్ వీరస్వామి ఉన్నారు.



మంత్రికి వినతి పత్రం అందజేసిన భాస్కర్, బాలకిషన్